# కథ

వామనరావు ఈ మధ్య తెగ ఆరాట పడిపోతున్నాడు. సంఘంలో తనకొక ప్రత్యేక మైన గుర్తింపు లభించాలని.
గొర్రె తోక గుమాస్తా ఉద్యోగం చేస్తూ సాధారణ జీవితం గడుపుతున్న తన గురించి ఎవరికీ తెలీదు. తన పేరు దేశమంతా, లేదా రాష్ట్రం అంతా లేదా కనీసం తన మండలంలో అయినా ప్రజలు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కానీ ఎల్లా ఎలా?
ఒక రోజు భార్యతో అన్నాడు.

"నాకు ప్రత్యేకమైన గుర్తింపు కావాలి."

అతని భార్య శైలజ ఏదో పని హడావుడిలో భర్త మాటలు సరిగ్గా వినలేదు.

"నాకు తెలీదు. మీరే ఎక్కడో పెట్టుకుని మర్చిపోయివుంటారు. వెతుక్కోండి." అంది అతను ఏదో వస్తువు అడుగుతున్నాడనుకుని.

కనీసం తన భార్య కూడా తన ఆరాటం పట్టించుకోక పోవడంతో బాధ కల్గిన వామనరావు ఆమెను చెయ్యి పట్టుకుని వంటింట్లోంచి లాక్కొచ్చి, కూర్చోబెట్టి తన బాధ చెప్పుకున్నాడు.

"రచయిత కండి..." అంది.

అది సాధ్యమా... తనకు ఉత్తరాలు రాయటమే రాదు. కథ లేం రాస్తాడు?

"పోనీ కార్టూనిస్టు కావడానికి ప్రయత్నించండి" మరో సలహా. ఛ... తను కుక్క బొమ్మ వేస్తే దాని క్రింద కుక్క అని రాస్తే గానీ ఎవ్వరూ గుర్తు పట్టలేరు.

"వక్తగా పేరు తెచ్చుకోండి." ఇంకో సలహా.

"నా బొంద... తను నల్గురి ముందు మాట్లాడితేనే చమట్లు పుడతాయి. సభలో మాట్లాడగలడా?

"నటుడు కాకూడదూ?" నాలుగో సలహా.

తను చిన్నప్పుడు ఒక నాటకం వెయ్యడం, డైలాగులు మర్చిపోయినందువల్ల ప్రేక్షకులు చెప్పులు విసరడం గుర్తొచ్చింది. కాళ్ళు వణికాయి.

"గాయకుడిగా మారితే...?" మరో సలహా ఇచ్చింది.

ఆలోచించాడు. ఇది బాగానే వుందని పించింది. దీనికి మరొకరి సహాయం అవసరం లేదు. నాలుగు సినిమా పాటలు కాస్త ప్రాక్టీసు చేస్తే సరిపోతుంది. నలుగురి ముందు పాడేందుకు భయమైతే కొత్తలో కళ్ళు మూసుకుని పాడితే సరి. ఆ తర్వాత నెమ్మదినెమ్మదిగా కళ్ళు తెరిచి పాడడం అలవాటు చేసుకోవచ్చు. భార్యను అభినందించాడు.

"శభాష్... చక్కని సలహా ఇచ్చావు. అందుకని నీకు ఓ చీర బహుమతిగా ఇస్తాను..." అన్నాడు.

శైలజ సంబరపడిపోయింది.

ఆ మర్నాడే ఒక మంచి జరీ చీర కొన్పించుకుంది.

ఆ రోజు ఆఫీసులో లంచి బ్రేకులో అందరూ వెళ్ళిపోయినా సీట్లోనే వుండిపోయి చిన్నగా ఏదో పాట అందుకున్నాడు.

అతనితో పని పడిన ఒక వ్యక్తి వచ్చి- "ఎంత బాగా పాడుతున్నారండీ..." అని పొగిడాడు.

అతని ఉద్దేశం తెలియని వామనరావు అతని మాటలు పచ్చి నిజాలని భ్రమించాడు.

"అవున్సార్... మీరు పాడుతుంటే ఆ గొంతు ఎక్కడో విన్నట్లు తోచింది. కొంచెం ఆలోచిస్తే అది యస్పీ బాలసుబ్రహ్మణ్యం గొంతులా అనిపించింది. మీ ఇద్దరి గొంతూ ఒక్క లాగే వున్నాయి. మీరు గొప్ప గాయకుడు కాగలరు. కాగలరు ఏమిటి అయ్యారు..." అన్నాడు.

అంతే... సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బైపోయాడు. వెంటనే అతని పని చేసి పెట్టాడు. ఆ సాయంత్రం ఇంటికి వచ్చి పాటలు ప్రాక్టీసు చేశాడు. ముందుగా ఘంటసాలను గుర్తు చేసుకుని 'శుక్లాంబరధరం విష్ణుం..' అంటూ పాడేడు.

ఒక రోజు పక్కింటాయన వచ్చి వామన రావుతో అన్నాడు.

ఈ మధ్య మీరు కుక్కను పెంచుతున్నారా! బాగానే వుంది. కానీ రోజూ సాయంత్రం దాన్ని కొట్టడం బాగోలేదు. అది కుయ్యో మని మొత్తుకుంటుంటే చాలా ఇబ్బందిగా వుంది మాకు." అన్నాడు.

తెల్లబోయాడు వామనరావు. తాము కుక్కని పెంచడం ఏమిటి? దాన్ని కొట్టడం ఏమిటి. ఏం అర్థం కావడం లేదు.

శైలజకు మాత్రం అంతా బోధ పడింది. భర్త పాడుతున్న పాటలు పక్కింట వాళ్ళకు కుక్క ఏడుపులుగా తోచాయి.

"మీకు కల్గిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. ఇక ముందు మీకు కుక్క అరుపులు వినపడవు లెండి..." అంది శైలజ కల్పించుకుని.

ఆ పెద్ద మనిషి తృప్తిగా తలాడించి వెళ్ళిపోయాడు.

"మనం కుక్కను పెంచడం లేదుకదా. ఆయనతో అలా చెప్పావేం?" అడిగాడు వామనరావు అయోమయంగా. అతనికి వివరించి చెప్పి,

"ఇక ముందునెమ్మదిగా పాడుకోండి పాటలు" అంది. పాపం అతని ముఖం చిన్నబోయింది. కాస్సేపైనాకా. 'శంకరా... నాద శరీరా...' అంటూ పాట మొదలు పెట్టాడు.

ఆమె శంకరుడి ఫోటో దగ్గరకు వెళ్ళినమస్కారం చేసి,

"ప్రభూ ఆగ్రహించి శపించకు ఆయన్ని మన్నించు" అని వేడుకుంది.




ఆ మర్నాడు వాళ్ళ ఎదురింటాయన రోడ్డు మీద వామనరావుని కల్సి.

"మీరు చాలా బాగా పాడుతున్నారు. మీ పాటలు వినాల్సని వుంది. సాయంత్రం మా ఇంటికి రాకూడదూ..." అంటూ ఆహ్వానించాడు.

వామనరావుకి భలే సంతోషం కల్గింది. ఆనందంలో తేలిపోయాడు.

ఆ సాయంత్రం శైలజతో ఆ విషయం చెప్పాడు. ఆమె కూడా ఆశ్చర్య పోయింది.

వామనరావు ఆ సాయంత్రం ఎదురింటికి వెళ్ళాడు. ఆయన సకల మర్యాదలూ చేసి ఓ

29-3-91 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

బాపు-రమణల పెళ్ళిపుస్తకం

అరడజను పాటలు పాడించుకున్నాడు. ఆ మర్నాడు మళ్ళీ రమ్మని ఆహ్వానించాడు.


వామనరావు ఉప్పొంగిన ఆనందంతో త్రివిక్రముడయ్యాడు.

ఆ మర్నాడు సాయంత్రం మళ్ళీ ఎదురింటికి వెళ్లాడు. ఎదురింటాయన అన్నాడు.

"అర్జంటుగా పని పడింది. అందరం బయటకు వెళ్తున్నాం. మన్నించాలి."

"ఫర్వాలేదు... వెళ్లండి... దాందేముంది... నేను మరో రోజు వస్తాను..." అంటూ తిరిగి వచ్చేశాడు.

ఎదురింటాయన భార్య ఆ మర్నాడు తమ పక్కింటావిడతో అంటున్న మాటలు శైజల చెవుల్లో పడ్డాయి.



—భరణి

"చాలా రోజులుగా మా ఇంట్లో తిష్ఠ వేసిన బంధువుల్ని ఎలా వదిలించుకోవాలా అని మా వారు మథన పడుతుంటే నాకు ఓ ఐడియా వచ్చింది.

వామనరావుగార్ని పిలిపించి పాటలు పాడించాం. వెంటనే భోజనాలు కూడా చేయకుండా బంధువులు వెళ్ళిపోయారు. ఆ తర్వాత రోజు మళ్లీ పాడేందుకు ఆయనొస్తే మేమే ఇంటి నుంచీ పారిపోయాం" అని నవ్వుతోంది. , తన భర్త పాటలు ఈ విధంగానైనా ఉపయోగపడ్డాయన్న మాట!

నాల్గు రోజుల తర్వాత వామనరావు బాబాయ్ తన కూతురు శుమైతాంగితో ఒక వారం రోజు లుండి పోదామని వచ్చాడు.

అక్కడకు వచ్చిన మర్నాటి నుంచీ శుమైంతాంగికి వాంతులు మొదలయ్యాయి.

వామనరావు చిన్నాన్న కంగారు పడిపోయాడు. ఆయనకు తెలుగు సినిమాలు కళ్ళ ముందు తిరిగాయి.

శుమైతాంగిని బుజ్జగిస్తూ వివరాలు అడిగింది శైలజ.

"నేను ఏ పాపం ఎరుగను" ఒకటే జవాబు చెప్పింది శుమై తాంగి.

డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్లింది ఆమెను శైలజ.

"ఛ... అనవసరంగా కంగారు పడుతున్నారు. అలాంటిదేం లేదు. పరమ ఘోరంగా వున్నది ఏమైనా తినినా... వినినా ఇలా డోకులు రావడం జరగవచ్చు..." అంది డాక్టరమ్మ.

తేలిగ్గా ఊపిరిపీల్చుకుంది శైలజ. ఆలోచించగా ఆ వాంతులకి కారణం గ్రహించింది.

ఇంటికి వచ్చిన తర్వాత శైలజ అంది.

"మీరు వెంటనే వెళ్లిపోండి. అలాగైతేనే అమ్మాయికి వాంతులు తగ్గేది. అమాయకురాల్ని అనుమానించకండి..." అంటూ భర్త పాటల వ్యవహారం గురించి చెప్పింది.

'అమ్మయ్య...' అని గుండెల మీద చెయ్యి వేసుకున్నాడు ఆయన.

"వాడి పాటలు నాకూ కర్ణకఠోరంగానే వున్నాయి. అవి భరించలేక నేనే వెళ్లిపోదామను కుంటున్నాను. కానీ నాకో సందేహం. వాడి పాటలు నువ్వూ వింటున్నావు కదా... మరి నీకు వాంతులు రాలేదేం?" అన్నాడాయన.

నిజమే... ఆలోచించింది ఓ నిమిషం. జవాబు తట్టింది. రోజూ పెంట కుప్ప దగ్గరే కూర్చునే వాళ్లకు ఆ దుర్గంధం అలవాటై పోతుంది. కొత్తగా అక్కడకు వచ్చిన వాళ్లే దాన్ని భరించలేక అవస్థ పడతారు.

ఒక రోజు వామనరావు భార్యతో.

'శైలూ... నీ కోసం ఆగదు ఏ నిమిషము నీ కోసమూ...' అనే పాట పాడనా?" అడిగేడు

శైలజ ముఖం చిట్లించుకుంది.

"వద్దండీ... ఆ ఏడుపు పాట నేను భరించ లేను. నాకు ఇష్టం లేదు ఆ పాట..." అంది.

"పోనీ... 'భలే మంచిరోజు... పసందైన రోజూ...' అనే పాట పాడనా?"

"వద్దండీ... ఆ పాటంటే నాకు చాలా ఇష్టం... దాన్ని మీరు పాడొద్దు..." అని చెప్పి అక్కడ్నుంచి వెళ్లిపోయింది.

వామనరావు వాళ్ల ఆఫీసరు గరుడ వాహనం గారు . ఆయన తన కూతురి పుట్టినరోజు గ్రాండ్‌గా పార్టీ పెట్టి డిన్నర్ ఏరేంజి చేశారు. అందర్నీ ఆహ్వానించారు.

ఆ పార్టీలో అందరి ముందూ పాడాలని వామనరావుకి అనిపించింది. తన కోరిక వెల్లడించాడు.

గరుడ వాహనంగారు అంగీకరించారు.

ఆ మర్నాడు ఏదో పని మీద గరుడ వాహనంగారి ఛాంబర్‌లోకి వెళ్లాడు వామనరావు.

"నిన్న పార్టీలో నా పాట ఎలా ఉందిసార్..." అడిగేడు. దాన్తో ఉగ్రుడయ్యాడు గరుడవాహనంగారు.

"నేను ఏ విషయం మర్చిపోవాలని ప్రయత్నిస్తున్నానో దాన్నే గుర్తు చేశావు..." అన్నారు.

"అలా పాడ్డమే కాక, ఎలా వుందని అడుగుతావా? అహ్ ఎంత ధైర్యం నీకు? నీ పాట విన్నాకా డిన్నర్‌లో ఎవ్వరూ ఏం తినలేక పోయారు. పదార్థాలన్నీ వృథా అయిపోయాయి. నీ పాట విన్నాకా మన సెక్షనాఫీసర్‌కి జ్వరం వచ్చింది. అందుకే రాలేదు ఈ రోజు ఆఫీసుకు!"

గరుడ వాహనం గారు కోపంతో గడగడ లాడిపోయారు.

"ఇక ముందు... నువెక్కడైనా పాడినట్టు తెలిసిందా నీకాన్ఫిడెన్షియల్ రిపోర్టునుపాడు చేస్తాను. అదన్యాయమే అయినా నువు చేసే అన్యాయం కంటే తక్కువే. సంగీతం మానేసి జాగ్రత్తగా వుండు" గర్జించాడు. 'య... యస్సార్!' అన్నాడు వామనరావు క్రుంగిపోతూ. తనే దోలా గుర్తింపు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తుంటే... ఇంత ద్వేషమెందుకు వీళ్ళకూ? 'నా సొంత గొంతుతో నేను పాడుకుంటే' అనుకుంటుండగా, 'వాళ్ళ సొంత చెవుల్తో వాళ్ళు వినాలిగా' అన్నది జ్ఞాపకమొచ్చి, 'సొంత చేతుల్తో మూసుకో వచ్చుగా' అని సవరించుకున్నాడు. నలుగుర్ని చంపందే వైద్యుడు కారు. పది మందినీ హింసించందే ప్రత్యేకత రాదు. అలా నలుగుర్ని చంపి పది మందిని హింసించీ ప్రత్యేకత సాధించి గుర్తింపు పొందిన వాళ్లని పొగుడుతూ, ఇంకా సాధన దశలో వున్న తనను సాధిస్తారు! 'ఇదేం న్యాయం?' అనుకున్నాడు వామనరావు.

చూడండి పెళ్ళిపుస్తకం